# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 45 వ భాగం

### గంగావతరణం – 1

క. శ్రీరాజిత! మునిపూజిత!
వారిధి గర్వాతిరేక వారణ బాణా!
సూరిత్రాణ! మహోజ్జ్వల!
సారయశస్సాంద్ర! రామచంద్ర నరేంద్రా! [9.1]

అంబరీషోపాఖ్యానం గురించిన వ్యాసంలో ఒకసారి భాగవతంలో నవమ స్కంధం గురించి చెప్పుకున్నాం కదా? ఈ గంగావతరణం కూడా ఆ స్కంధంలోనిదే. ఈ స్కంధం మొదలుపెడుతూ పోతన రాసిన మొదటి పద్యం ఇది. ఎన్నిసార్లు చదివినా అతి సులభమైన పదాలతో రాముడికి రాసిన, మరోసారి చదవాలనిపించే పద్యం ఇది. సరదా ప్రశ్న – ఈ పద్యంలో శ్రీరాజిత, సూరిత్రాణ అంటే అర్థం మనలో ఎంత మంది చెప్పగలం? శ్రీరాజిత – శ్రీ (లక్ష్మీదేవి తో), రాజిత (ప్రకాశించేవాడు); సూరిత్రాణ – సూరి (పండితులని) త్రాణ (కాపాడేవాడు). పద్యంలో ద్రాక్షాపాకం ఎంత సులభంగా ఉందో, దాని అర్థం అంత నిఘూఢంగా ఉండడం, పోతన కవితా పటిమకి నిదర్శనం. ముందు వ్యాసాల్లో గంభీరమైన పోతన వచనం ఎలా ఉందో చూసాం – శ్రీహరి నృసింహావతారంలో బయటకొచ్చినప్పుడూ ఆ తర్వాత వామనావతారంలోనూ. ఈ గంగావతరణం లో మరోసారి ఆ కవితాఝురి – అసలు సిసలు గంగా ప్రవాహంలాగా చూడబోతున్నాం.

అసలు ఈ కథలోకి వెళ్ళబోయేముందు గంగ భూమిమీదకి దిగడానికి ఎవరు కారకులు అనేది చూస్తే సగరులు అని తేలుతుంది. ఈ సగరులు రాముడి పూర్వులు. వీళ్ళలో మనకి బాగా తెలిసినవాడు త్రిశంకుడు. బొందితో స్వర్గానికి వెళ్లడానికి విశ్వామిత్రుడి ద్వారా ప్రయత్నించి అటు పైకీ ఇటు కిందకీ కాకుండా ఆ మహర్షి సృష్టించిన త్రిశంకు స్వర్గంలో ఉన్నవాడు. ఆయన పుత్రుడే హరిశ్చంద్రుడు. ఎప్పుడూ అబద్ధం ఆడని హరిశ్చంద్రుడి కథ మనకి తెలిసినదే. అక్కడనుంచి అలా ఆ వంశం సగరులకి పాకింది.

…. సకలబంధవిముక్తుండై హరిశ్చంద్రుం డవాఙ్మానస గోచరంబయిన నిజరూపంబుతో వెలుంగుచుండె; అతని కుమారునకు లోహితునకు హరితుండు పుట్టె; హరితునకుఁ జంపనామ ధేయుఁడు జనియించె; అతండు దనపేర జంపానగరంబు నిర్మించె; ఆ చంపునికి సుదేవుండు, సుదేవునికి విజయుండు, విజయునకు రురుకుండు, రురుకునకు వృకుండు, వృకునకు బాహుకుండు జనియించిరి; అందు బాహుకుండు. [9-201]

అలా సాగిన వంశంలో లోహితుడు, హరితుడు, చంపుడు, సుదేవుడు, విజయుడు, రురుకుడు, వృకుడు, బాహుకుడు పుట్టారు. ఇక్కడకొచ్చేసరికేమైందంటే,

సీ. దండించి పగవారు దనభూమిఁ జేకొన్న;
నంగనలును దాను నడవి కేఁగి
యడవిలో ముసలియై యాతఁడు చచ్చిన;
నాతని భార్య దా ననుగమింపఁ
గదియుచో నా స్త్రీకి గర్భంబు గలుగుట;
యౌర్వమునీశ్వరుఁ డాత్మ నెఱిఁగి
వారించె; నంత నవ్వనజాక్షి సవతులు;
చూలు నిండారినఁ జూడఁ జాల [9-202]

తే. కర్థి నన్నంబు గుడుచుచో నందుఁ గలిపి
విషము పెట్టిరి; పెట్టిన విరిసి పడక
గరముతోఁ గూడ సగరుండు ఘనుఁడు పుట్టి
వరయశస్ఫూర్తితోఁ జక్రవర్తి యయ్యె [9-202.1]

ఈ బాహుకుడి శతృవులు రాజ్యం లాక్కుంటే ఆయన, ఆడవాళ్లతో కలిసి అడివికి వెళ్ళేడు ఎక్కడా దిక్కులేక. అయితే అక్కడ ఆయన చనిపోయేసరికి వాళ్ళావిడ సహగమనం చేయబోయింది. అప్పటికి ఔర్వుడనే మునికి ఈవిడ గర్భవతి అని తెలిసి అలా చేయొద్దని వారించాడు. ఆవిడ కష్టాలు ఇంకా పోలేదు. సవతులు విషం పెట్టి చంపేద్దామని చూసారు. అయితే ఈ విషం పనిచేయక ఆవిడకి సగరుడనే వాడు పుట్టేడు. విషం (గరము, గరళము) తో పుట్టాడు కనక సగరుడు అని పేరు. ఈయన గట్టివాడే. కష్టపడి చక్రవర్తి అయ్యేడు.

ఈ కథ ఇంతవరకూ చదివితే మనకి తెలిసేది ఏమిటంటే, ఇప్పుడే కాదు ఏ కాలంలోనైనా సరే ప్రపంచం ఇలాగే ఉంటుంది. అసూయ, ఈర్ష్యలు, ద్వేషాలు, కొట్టుకోవడం, యుద్ధాలు, ఒకరు రాజు అవ్వాలనుకోవడం, మరొకరు వాణ్ణి చంపుదామనుకోవడం అలా. అయితే కర్మ సంగతి ఒకసారి చూస్తే తెలిసేదేమిటంటే, ఎవరు ఎక్కడ ఎలా బతికి బట్టకట్టగలరో అక్కడ అలా బతికి తీరుతారు. ఆ బతికిన వాళ్ళు వారి వారి సంస్కారాల బట్టి తపస్సు చేసుకుని భగవంతుణ్ణి చేరుకోవడమో లేకపోతే ఒకటి తర్వాత మరో జన్మ ఎత్తుతూ పునరపి జననం పునరపి మరణం అవడమో చూస్తూ ఉంటాం. దీన్ని గ్రహించే శివానందుల లాంటి మహర్షులు చెప్తూ ఉంటారు – "ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది. అది ఎలా ఉండాలో అలాగే ఉంది సరిగ్గా. దాన్ని మార్చడానికి ప్రయత్నించడం కంటే మనం మారడం మంచిది." దీనినే గాంధీగారు చెప్పడం ప్రకారం, "ఏ మార్పు నువ్వు ప్రపంచంలో చూడాలనుకుంటున్నావో ఆ మార్పు నీ దగ్గర్నుంచే మొదలవ్వాలి."

శా. చండస్ఫూర్తి నతండు తండ్రిపగకై సంగ్రామరంగంబులం
జెండెన్ హైహయబర్బరాదుల; వధించెం దాళజంఘాదులన్;
ముండీభూతులుగా నిరంబరులుగా మూర్తుల్ సబీభత్సులై
యుండంజేసె, నిజారులన్ సగరనామోర్వీవిభుం డల్పుఁడే [9-203]

ఈ సగరుడు హైహయులనీ, బర్బరీకులనీ గెలిచి తండ్రి దగ్గిర నుంచి రాజ్యం లాక్కున్న వాళ్లందర్నీ జయించాడు. అటువంటి వాడు అల్పుడు కాదు కదా? ఈ పద్యం చివరిపాదంలో "సగరనామోర్వీవిభుం" అనేది రెండర్థాలతో రాసినట్టు కనబడుతోంది చూడండి. సగరుడు పుట్టడానికి ఎవరు కారణం? అతని తల్లి సహగమనం చేద్దామనుకుంటూంటే వద్దని ఎవరు వారించారు? "ఔర్వుడు" అనే ముని. సగరుడు రాజు అయ్యాక ఆ మునికి కూడా ప్రభువు కిందే కదా లెక్క? ఆయన పేరు ఇందులో వచ్చేలాగ "ఔర్వీ విభుండు" అన్నాడు సగరుణ్ణి పోతన. కానీ దీని విడదీస్తే సగర+నామ+ఉర్వీ+విభుండు అని తెలుతుంది. ఉర్వి అంటే భూమి. ఉర్వీ విభుండు – భూమిని పాలించేవాడు – రాజు. భూమి అనేదానికి పోతన మరో పదం రాయలేడా? అదే పోతన కవిత్వంలో ఉన్న గొప్పదనం.

క. ఖగరాజరుచులు గల యిల
పగరాజుల నడఁచి యేలె బాహాశక్తిన్
నగరాజధీరు శూరున్
సగరున్ హతవిమతనగరుఁ జను వినుతింపన్. [9-204]

సగరుడు సూర్యవంశం వాడు కనక పోతన ఏమంటున్నాడో చూడండి. సూర్య కిరణాలు చుట్టూరా పరుచుకున్న భూమి అంతటిలోనూ ఉన్న శతృవులని అణిచేసి జనులు మెచ్చుకునేలాగ రాజ్యం చేసాడు. ఈ పద్యంలో సూర్యుణ్ణి ఖగరాజు అనీ, శత్రువలని పగరాజులనీ, సగరుణ్ణి నగరాజ ధీరుడు (మేరు పర్వతమంత ధీరుడు) అనీ వాడి పోతన నాలుగు పాదాల్లో ప్రాస ఎలా కలిపాడో గమనించారా?

సీ. ఔర్వుండు చెప్పంగ నమర వేదాత్మకు;
హరి నీశు నమృతు ననంతుఁగూర్చి
వాజిమేధంబులు వసుధేశ్వరుఁడు చేసె;
నందొక్క మఖమున హయము విడువ
నగభేది గొనిపోయి నాగలోకంబునఁ;
గపిలుని చేరువఁ గట్టి తొలఁగెఁ;
నంత గుఱ్ఱముఁ గాన కా రాజు దన పుత్ర;
నివహంబు దిశలకు నెమకఁ బంప [9-205]

తే. వారు నిల యేడు దీవుల వరుస వెదకి
మఖతురంగంబు లేకున్న మగిడి రాక
ప్రాభవంబున దోర్దండబలము మెఱసి
గ్రొచ్చి కోరాడి త్రవ్విరి కుతల మెల్ల. [9-205.1]

సగరుడికి ఇద్దరు భార్యలు. పెద్దావిడ విదర్భరాజు కూతురు కేశిని. రెండో ఆవిడ అరిష్టనేమి కూతురు సుమతి. ఈ రెండో ఆవిడకే అరవైవేల మంది కొడుకులు పుట్టారుట. సగరుడి చేత ఔర్వుడు అశ్వమేధాలు చేయించాడు. ఎవరి గురించి ఈ యజ్ఞాలు చేయడం? "హరి నీశు నమృతు ననంతుఁగూర్చి." అనంతుడు అంటే అంతం లేని హరి, అమృతుడైన మహా విష్ణువు గురించి. అందులో ఓ యజ్ఞాశ్వం తప్పించుకుపోయింది.

దీని సంగతి చూసి రమ్మని ఈ అరవైవేల మందినీ సగరుడు పంపించాడు. వీళ్ళు ఏడేడు దీవులన్నీ వెదికారు. ఎక్కడా కనిపించకపోయేసరికి భూమిని తవ్వుకుంటూ పోయారు పాతాళంలో ఉందేమో చూడ్డానికి.

వ. ఇట్లు సుమతి కొడుకులు నేలంద్రవ్వి పాతాళంబునం దూర్పుముట్టి యున్న నుత్తరభాగంబునం గపిలముని పొంతనున్న తురగంబుఁ గని.

[9-206]

చ. ఎఱిఁగితి మద్దిరయ్య తడవేటికి? గుఱ్ఱపుదొంగ చిక్కె; నీ
జఱభుని బట్టి చంపుఁ; డతిసాధుమునీంద్రుఁడుఁబోలె నేత్రము
ల్దెఱవక బాకినోరు మెదలింపక బైసుక పట్టె నంచు న
య్యఱువది వేవురున్ నిజకరాయుధముల్ జళిపించి డాయుచోన్. [9-207]

ఇలా సుమతి కొడుకులు పాతాళంలోకి వెళ్ళేసరికి అక్కడ కపిల మహాముని తపస్సు చేసుకునే చోట గుర్రం కట్టేసి ఉండడం కనిపించింది. ఎన్నో ఏళ్ళు అన్ని చోట్లా చూసి, కష్టపడితే కనిపించిన విజయం కదా ఇది? అందువల్ల మంచి హుషారుగా అనుకుంటున్నారు, “ఇదిగో గుర్రం దొంగ దొరికేడురా, ఇంక ఆలశ్యం దేనికి, పట్టుకుని ఈయన్ని చంపేసి గుర్రాన్ని తీసుకెళ్ళిపోదాం.” ఇలా అనుకుని ఆయనమీద రకరకాల ఆయుధాలతో మీద పడబోయేరు.

చ. కపిలుఁడు నేత్రముల్ దెఱవఁగాఁ దమ మేనుల మంట పుట్టి తా
రపగతధైర్యులై పడి యఘాళికతంబున మూఢచిత్తులై
నృపసుతు లందఱున్ ధరణి నీఱయి రా క్షణమంద; సాధులం
దపసులఁ గాసిఁ బెట్టెడి మదస్ఫురితాత్ములు నిల్వనేర్తురే? . [9-208]

ఇలా తనమీదకి వచ్చే వాళ్ళని కపిలుడు కళ్ళు తెరిచి చూసాడు. అరవై వేల మందీ వాళ్ల శరీరాలలోంచి మంటలు పుట్టి అక్కడికక్కడే భస్మమైపోయారు (ధరణి నీఱయిరి) వెంఠనే ఆ క్షణంలోనే. లేకపోతే సాధువులైన వార్ని మదగర్వంతో బాధించేవాళ్ళు బతగ్గలరా?

అదేమిటి, కపిలుడంతటి సౌజన్యమూర్తికి అరవైవేల మందిని ఒకేసారి ఒక్క క్షణంలో బూడిద చేసే అంత కోపం ఎలా వస్తుంది? కపిలుడు అంటే సాంఖ్యయోగాన్ని ఆపోసన పట్టిన మునీ, సాక్షాత్తూ మహా విష్ణువు అవతారం అని చెప్తారు కదా? ఇంతటి కోపం ఉన్న మనిషి మహర్షి ఎలా అవుతాడు? దీనికి సమాధానం ముందు వ్యాసంలో దొరుకుతుంది మనకి.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS